క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మియాపూర్: చందానగర్ డివిజన్ విశ్వేశ్వరకాలనీలో శ్రీ పోచమ్మ సహిత దుర్గ మల్లీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామల్లీశ్వర స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి హాజరై ప్రత్యే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీంస్టోన్‌లో సరి'కొత్త' రుచులు



మాదాపూర్: మాదాపూర్‌లోని క్రీంస్టోన్, కొండాపూర్‌లోని న్యూ అవతార్ క్రీంస్టోన్ స్టోర్‌లలో ఆదివారం నటి కృతికారాయ్, నటుడు సూర్యశ్రీనివాస్ నిర్వాహకుడు ఫ్రాంక్లిన్‌తో కలసి నూతన షేక్స్, ఫ్రూట్ ఇన్ ఫ్రూట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగరవాసుల అభిరుచులకు తగ్గట్టుగా మరిన్ని రకాల రుచులను అందిస్తున్నట్టు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లను అందజేస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ కోటలో వచ్చిన స్పోర్ట్స్ పరికరాలను మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డితో కలసి క్రీడకారులకు అందజేశారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే క్రీడకారులకు సహకరించేందుకు ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చెర్మన్ విజయ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మైత్రి క్లబ్ జనరల్ సెక్రెటరీ గిరి, నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్‌ఎండీఏ భూమిని ఆక్రమించి చేపట్టిన హోటల్ నిర్మాణాన్ని శనివారం రాత్రి హెచ్‌ఎండీఏ అధికారు లు కూల్చివేయించారు. మున్సిపాలిటీ పరిధిలోని మై ఫేర్ విల్లాస్‌కు వెళ్లే మార్గంలోని రో డ్డును ఆనుకొని ఉన్న ఓ స్థల యాజమాని పక్క నే ఉన్న హెచ్‌ఎండీఏ స్థలాన్ని ఆక్రమించి హో టల్ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు స్థలాన్ని సర్వే చే యించి హోటల్ నిర్మాణాన్ని కూల్చివేయించారు.

క్వారీలో మృతదేహం లభ్యం



రాములు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చిన్న బండ క్వారీలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన వడ్డె రాములు వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్. రోజు మాదిరిగానే గీతం యూనివర్సిటీ వైపు వాకింగ్ కు 14వ తేదీ ఉదయం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి కోసం వెతుకుతున్న క్రమంలో 15వ తేదీ ఉదయం రుద్రారం గ్రామానికి చెందిన భిక్షపతి తన గేదెలను మేపుతూ గ్రామ శివారులోని చిన్న బండ వైపు వెళ్లగా క్వారీలో రాములు మృతదేహం కనిపించింది. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఉత్తర్ ప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన భద్రు తన కుటుంబ సభ్యులతో బొంతపల్లి గ్రామంలో నివసిస్తున్నాడు. భద్రు చిన్న కుమార్తె కాజల్ ఓ ప్రైవేటు పరిశ్రమలో విధులు నిర్వహిస్తుంది. కాగా ఈనెల 14 నుంచి కాజల్ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కాజల్ అక్క సల్మాన్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు.

సత్వర పరిష్కారమే లక్ష్యం...

సమస్యలపై సమరం!





పటాన్‌చెరు ఆర్సీపురం సర్కిల్‌లో కాలనీ సంక్షేమ సంఘాలతో సమావేశమైన ఆయా విభాగాల అధికారులు

- ప్రజలతో అధికారుల ముఖాముఖి
- నేటి నుంచి కాలనీల్లో సమీక్ష నిర్వహించనున్న అధికారులు
- సమస్యలు తెలుసుకోనున్న ఐదు విభాగాల అధికారులు
- సద్వినియోగం చేసుకోవాలి: జోనల్ కమిషనర్ శంకరయ్య

మీ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతుందా... వీధి దీపాలు వెలగడం లేదా... రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయా... ఫిర్యాదులు చేసినా ఎవరు సరిగా స్పందించడం లేదా... అయితే నేడు అధికారులే మీ వద్దకు వస్తున్నారు. సమస్యలు తెలియజేస్తే పరిష్కారం చూపిస్తారు.

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీలో ఇప్పటికే మొదలైన (కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అండ్ సిటిజన్ గ్రీవియన్స్ డిస్పోసల్ ప్రోగ్రాం, ఒక్క మాటలో చెప్పాలంటే కాలనీ కాంటాక్ట్ అని కూడా పిలువొచ్చు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, టీఎస్‌పీడీసీఎల్ అధికారులు కాలనీ సంక్షేమ సంఘాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశమవుతారు.

- ఆయా కాలనీల ప్రజలు సమావేశానికి హాజరై తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టి తీసుకువెళ్లాలి. సమస్యలను గుర్తిస్తూ చెక్ లిస్ట్‌ను తయారు చేసి సంబంధిత అధికారులు సంతకాలు చేసి ఇస్తారు. అధికారులు గుర్తించిన సమస్యలను ఆయా విభాగాల సమన్వయంతో అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తారు.
- శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని పటాన్‌చెరు సర్కిల్ పరిధిలో ఇప్పటికే కాలనీ కాంటాక్ట్ ప్రారంభమైంది.
- శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని జోనల్ అధికారులు తెలిపారు. వెస్ట్ జోనల్ పరిధిలోని నాలు సర్కిళ్లలో మొత్తం 539 కాలనీలు ఉండగా యూసూఫ్ గూడలో 98, శేరిలింగంపల్లిలో 216, చందానగర్‌లో 168, ఆర్సీపురం పటాన్‌చెరులో 57 కాలనీలు ఉన్నాయి.

సమస్యల గుర్తింపు ఇలా...

జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వచ్చే చెత్త, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, గ్రీన్ వేస్ట్ గుర్తించడం, మొక్కలు నాటడం, పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహణ,పార్కులలో వాకింగ్ ట్రాక్‌ల తీరు, రోడ్లపై గుంతలు, వీధి దీపాలు, నాలా సేఫ్టీ అంశాలు, మ్యాన్ హోల్స్ సమస్య, దోమల బెడద తదితర సమస్యలపై చర్చిస్తారు.

- జలమండలి పరిధిలోకి పైప్‌లైన్ లీకేజీ, మంచి నీటి సరఫరాలో తేడాలు, మొక్కలకు నీళ్లు, వరదలు, వాటర్ లాగింగ్ పాయింట్ల గుర్తింపు, చెరువు కాలుష్యం తదితర అంశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారు.
- పోలీసు విభాగం పరిధిలోకి వచ్చే జూదం, గంజాయి, డ్రగ్స్ దందాలు, ఈవ్ టీచింగ్, పబ్లిక్ ఏరియాలో మద్యం తాగడం తదితర సమస్యలను గుర్తిస్తారు.
- ఫీవర్ కేసులు, ఇతర వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ ఆరా తీస్తుంది.

పరిష్కారం ఇలా...

డ్రైనేజీ, పైప్ లైన్ లీకేజీ, వెలగని వీధి దీపాలాంటి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తారు. సమస్యల పరిష్కారానికి నిధులు అవసరం అయితే అవకాశాలను బట్టి పరిష్కరిస్తారు. నిధులు అవసరమున్న సమస్యలే ఎక్కువగా దృష్టికి వచ్చే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి...



ఐదు విభాగాల అధికారులు కాలనీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశమవుతారు. ప్రజలు తెలిపిన సమస్యలను చెక్ లిస్ట్ తయారు చేసి అధికారులు, కాలనీ సంఘాల నాయకులు సంతకాలు చేస్తారు. మా దృష్టికి వచ్చిన సమస్యలను ఎంత మేరకు పరిష్కరించామో కొద్ది రోజుల్లోనే తెలుస్తుంది. నిధులు అవసరమున్న సమస్యల పరిష్కారానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంటుంది. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారు. ఆయా కాలనీలకు ఇప్పటికే నోడల్ అధికారులను నియమించాం.

– శంకరయ్య, కమిషనర్, వెస్ట్ జోనల్

విద్యతోనే ఉజ్వల భవిత

- మంత్రి చామకూర మల్లారెడ్డి



ప్రతినిధులకు మెమెంటోను అందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

రాయదుర్గం: విద్యావంతులైతేనే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని షరటాన్ హోటల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, మెటామోర్ఫోసిస్ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ టుడే కాంక్లేవ్' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యాసంస్థల్లో నూతన విద్యావిధానంపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ టుడే కాంక్లేవ్ పేరిట సదస్సులు పెట్టడం, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని, ప్రతి విద్యా సంస్థలో నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్యాలు కూడా విద్యార్థులు నేర్చించేలా చూడాలన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ మాట్లాడుతూ... నూతన విద్యావిధానాన్ని దేశవ్యాప్తంగా అవలంబించవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా నూతన విద్యా విధానంపై అందరిలోనూ అవగాహన ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు. పల్లవి గ్రూప్ స్కూల్స్ చైర్మన్ మల్కా కోమురయ్య మాట్లాడుతూ... ఎన్ఈపీ–2020 విధానంపై మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్‌టీసీ కో ఫౌండర్ మల్కా యశస్వి ద్వారా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. డీపీఎస్ సీనియర్ ప్రిన్సిపాల్ సునీతారావు, 450 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా భ్రమరాంబామల్లికార్జునుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, భక్తులు



పాల్గొన్న మంత్రి కేటీఆర్ తదితరులు

శేరిలింగంపల్లి: వేదపండితుల మంత్రోచ్చరణలు... భక్తుల జయజయధ్వానాలతో నల్లగండ్ల ప్రాంతంలోని భ్రమరాంబికామల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా భ్రమరాంబికామల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని మామిడిఆకులు, పూలు, విద్యుత్ దీపాలతో నేత్రపర్వంగా అలంకరించారు. ఉదయం స్వామివారిని, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, అలంకారం వంటి పూజలను నిర్వహించారు. నల్లగండ్ల పరిసర ప్రాంతాలలోని భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పరవశించిపోయారు. ఉత్సవాలను మాదాపూర్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజితాగౌడ్ పర్యవేక్షించారు.

- నల్లగండ్లలోని భ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారి కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వివేకానంద, ఎమ్మెల్సీలు ఎస్.రమణ, ఎం.ఎస్.ప్రభాకర్, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్లు మంజులా రఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్ ఉప్పలపాటి శ్రీకాంత్, గంగాధర్ రెడ్డి, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ నాయకులు, నల్లగండ్ల, పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



యువకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గాంధీ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: బంగారు తెలంగాణ నిర్మాణం కోసం యువత భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం కొండాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు యువకులకు కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు, ఉపాధి అవకాశాలను చూసి యువత బీఆర్‌ఎస్ పార్టీ వైపు చూస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు లోకేష్ కుమార్, కిరణ్, సంతోష్, వెంకటచారీ, వంశీ కృష్ణ, పవన్, అజయ్, ముర్గేష్, గోపాల్, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరిధిలోని బండ్లగూడ కాలనీలో నూతనంగా ఏర్పడిన ముస్లిం మహిళా గ్రూప్‌నకు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి గూడెం యాదమ్మతో కలిసి ఆదివారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహిళల ఆభ్యున్నతికి, టైలరింగ్ నైపుణ్యాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అదేవిధంగా ఐదు కుట్టుమిషన్లు అందించిన గొల్ల కృష్ణయాదవ్‌ను కార్పొరేటర్ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, మాజీ వార్డు కమిటీ సభ్యుడు నవీన్‌రెడ్డి, భారత్, అస్మాబేగం, ఊర్మిల, పద్మ, షాబెర్, అఫ్జల్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.



కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్ ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చేందుకు కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సమాజంలో కులం, మతం, వర్ణం లింగ బేధాలు లేవని.. అందరూ ఒకటేనని 12వ శతాబ్దంలో విశ్వవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు విశ్వగురు మహాత్మ బసవేశ్వరుడు అని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని బీరంగూడ చౌరస్తాలో ఎమ్మెల్యే సొంత నిధులు రూ.30లక్షలతో ఏర్పాటుచేసిన బసవేశ్వరుడి కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడి స్ఫూర్తితో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అదేవిధంగా లింగాయత్‌లను ఓబీసీలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బసవేశ్వరుడి జయంతిని అధికారంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. బీరంగూడ గుట్టపై వేయి గజాల స్థలాన్ని వీరశైవ లింగాయత్ కులస్తులకు కేటాయించి భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, కార్పొరేటర్ పుష్పనగేశ్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

రాయదుర్గం: ముస్లింలకు రంజాన్ పర్వదినం ఎంతో పవిత్రమైనదని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీలోని మసీదు వద్ద ముస్లింలకు రంజాన్ కానుకలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంజాన్ పర్వదినం సందర్భంగా అందరూ ఉపావాసదీక్షలు చేపట్టి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారని గుర్తు చేశారు. ఐక్యమత్యంగా ఉంటూ అందరూ రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ సలీమ్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ సీనియర్ నాయకులు విష్ణు, క్రాంతి, బాబా, స్థానిక నాయకులు, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపూనగర్‌లో...

శేరిలింగంపల్లి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలను ఆదివారం బాపూనగర్‌లోని మసీదులో ముస్లింలకు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా అందరూ పర్వదినాల్లో నూతన దుస్తులు ధరించాలనే తపనతో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు సలీమ్, నేతలు ముంతాజ్‌బేగం, అర్షద్‌మౌలానా, షేక్‌మతీన్, సర్వర్, గోపాల్‌యాదవ్, సల్మాన్, అక్బర్, షేక్ మహ్మద్, రవి తదితరులు పాల్గొన్నారు.



కానుకలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



బాపూనగర్‌లో కానులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

అలరించిన బెంగాలీ నృత్యాలు



మాదాపూర్: బెంగాలీ కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం ఉత్తరన్ బంగియా బెంగాలీ సమాజం పొయిల బైశాఖ్ బెంగాలీ నూతన సంవత్సరం పండగను నిర్వహించుకున్నారు. రవీంద్ర సంగీత్, బెంగాలీ పాటలు, రవీంద్ర నృత్యాలను , బెంగాలీ ఫోక్ డాన్స్‌లతోపాటు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి అలరించారు. బెంగాలీ కాటన్ శారీస్, కుర్తీస్, బెంగాలీ హస్తకళ ఉత్పత్తులు, జ్యూలరీ, పసందైన ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జంటనగరాలలో ఉన్న బెంగాలీలు సంప్రదాయ వస్త్రాలను ధరించి అలరించారు.

మతసామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

రాయదుర్గం: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని హఫీజ్‌పేట్ డివిజన్‌లోని సాయినగర్‌లోని మసీదు ప్రాంగణంలో దావత్ ఏ ఇఫ్తార్' విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... రంజాన్‌ను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలనే సీఎం కేసీఆర్ కానుకలను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రంజాన్ ఉపవాసాలతో మంచితనం, సంస్కారం అలవడుతుందని, మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు అక్తర్, ఎం.డి.ఇబ్రహీం, శ్రీనివాస్ చౌదరి, లాల్‌మహ్మద్ పటేల్, షేక్ లాల్‌పటేల్, అహ్మద్, షరీఫ్, అబ్దుల్ జబ్బార్, మహ్మద్ అజీమ్, హేమంత్, మన్సూర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి



రన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: మియాపూర్‌లో ఆవంతిక గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే, 5కే, 10కే రన్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలందరూ ఆరోగ్యం పై దృష్టి సారించాలని, నిత్యం నడక, వ్యాయమం, యోగా అలవాటు చేసుకోవాలన్నారు. శారీరక శ్రమతో పాటు, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమన్నారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదం చేస్తాయననారు. రన్‌లో కాలనీలోని యువతీయువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆవంతిక గ్రూప్ చైర్మన్ శిరీష, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నానక్‌రాంగూడలో గడపగడపకూ బీజేపీ

- శేరిలింగంపల్లిలో బీజేపీ విజయం తథ్యం
- ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్

రాయదుర్గం: అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజామద్దతుతో ఘన విజయం సాధిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా నానక్‌రాంగూడలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పాదయాత్ర నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ సిద్ధాంతాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో అన్ని వర్గాల ప్రజలకు మార్పు అవసరమని భావిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రస్తుతం బీజేపీ నాయకులతో అధికారులను కలిసి కాలనీ, బస్తీల వారీగా సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరిస్తామన్నారు. శేరిలింగంపల్లిని నగరంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు మా దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా, గచ్చిబౌలి డివిజన్ నాయకులు, వివిధమోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నానక్‌రాంగూడలో గడపగడపకూ బీజేపీలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి తదితరులు